# కొత్త జీవితానికో కొండగుర్తు

రేపేమిటి?

అవును, దినం గడవక, రోజొక గండంగా నోటికి అయిదు వేళ్ళూ పోని స్థితిలో, దిగజార్చే దిగుళ్ళతో క్రుంగి పోతూ ఉండే మనిషి వేసుకునే ప్రశ్నే ఇది- 'రేపేమిటి?' అని.

ఇదే ప్రశ్న అనంతరావు కూడా అప్పుడప్పుడు వేసుకుంటూ ఉంటాడు. అయితే అతని పరిస్థితి వేరు అతని ఆలోచనా ధోరణి వేరు. ఆ ప్రశ్న జవాబు వేరు. అందుకే ఇంత దూరం చెప్పాల్సి వచ్చింది.

రేపేమిటి?

అనుకున్నాడు అనంతరావు. అతని దృష్టి కాలెండరు మీదకి పోయింది. నల్లని కాలెండరు అంకెల మధ్య ఎర్రరంగు అంకెలు!

ప్రక్కనే పండుగల జాబితా.

ఆగస్టు పదిహేను! దేశానికి పుట్టిన రోజు పండుగ అది. తృప్తిగా నిట్టూర్చాడు అనంతరావు.

భేష్, బావుంది. ఇవాళ్టితో ఒక అనంతరావు జీవితం ముగిసి పోతోంది. రేపట్నుంచి సరికొత్త అనంతరావు సరికొత్త జీవితం ప్రారంభించబోతున్నాడు!

శనిగ్రహంలా పట్టిన పాడు అలవాట్లన్నింటికీ స్వస్తి చెప్పబోతున్నాడతను రేపటి నుంచి. అవునవును రేపట్నుంచి తను మంచి మనిషి. మంచి వ్యక్తిత్వం, నడవడిక కలిగి ఏ చెడ్డ అలవాటూ లేని సౌజన్యమూర్తి.

అతని కానందంగా ఉంది. తన నిర్ణయానికింక తిరుగులేదు. తను మారిపోయి తీరుతాడు.

ఎలా?

శకుంతలకి ఆదర్శ భర్తగా-

నాగరత్నానికీ, మణికీ, చంటిగాడికీ ఇష్టమైన నాన్నగా -

మంచం పట్టిన ముసలి అమ్మకి మంచి కొడుకుగా-

ఆఫీసులో అందరికీ తలలో నాలుకగా-

రేపే! రేపట్నుంచే తను అందరి చేతా 'మన అనంతరావు మంచి జంటిల్మన్ సుమండీ!

అనిపించుకోబోతున్నాడు.

తను మారితే -

నట్టింటి ద్వారం దగ్గర కొంగు పరుచుకుని, పడుకుని ఎగశ్వాసలమధ్య వెక్కిళ్ళు ఆపుకుంటూ శకుంతల దుఃఖించే - పేగులు కొరికేసే శక్తి గల ఆ దృశ్యం కనిపించదింక.

పురుషస్పర్శ కోసం వెంపర్లాడుతూ నాగరత్నం ఎదురింటి కిటికీ చువ్వలవేపు కళ్ళలో ఒత్తులు వేసుని ఆశగా ఎదురు చూస్తూ కూచోదు.

చింకి పరికిణీలు తొడుక్కుని స్కూలు కెళ్ళలేక మణి వాళ్ళమ్మని సాధించే సంఘటనలింక జరగవు.

డాక్టరు చెప్పిన టోనోఫెర్స్ డ్రాప్స్ తాను కొనక, కొనలేక పోవడంతో ఒంట్లో ఐరన్ లోపించి, పైకా ముదిరి చంటిగాడు రాతి బెడ్డలూ చాక్ పీసులూ, గోడ పెచ్చులూ తినే దుస్థితి మరుండదంతే-

మందు లిప్పించడంలేదని అమ్మ తనని దుమ్మెత్తిపోస్తూ శకుంతలమీద విరుచుకు పడటాలూ ఉండవు.

అవునవునెంత అందమైన నిజాలు! అందుకే తను మారిపోవాలను కుంటున్నాడు.

ఇది వరకు కూడా చాలా సార్లు ఇలాగే అనుకున్నాడు. ఏడాది క్రితం-

శివరాత్రికి ముందురోజు ఇలాగే పట్టుదలగా నిశ్చయించుకున్నాడు.

రేపట్నుంచి తాగను,

పేకాట ఆడను.

అప్పులు చెయ్యను.

మెరక వీధి ముఖం, చూడను.

పొదుపుగా ఉంటాను.

మారిపోవడానికి ముహూర్తం రేపే. తన జీవితంలో ఇంత గొప్ప టర్నింగ్ పాయింట్ వచ్చిన రోజు తనెప్పుడూ మరిచిపోకూడదు. గుర్తుండితీరాలి. కాబట్టి అది సాధారణమైనరోజు కావడానికి వీల్లేదంతే. ఆ రోజుకి తన జీవితంలో కాకుండా అన్ని విధాలా కూడా ప్రాముఖ్య ఉండాలి. చప్పున గుర్తుకు వచ్చేదిగా ఉండాలి.

రేపు శివరాత్రి. పందొమ్మిది వందల డెబ్భై ఏడు శివరాత్రి నుండి తను మారిపోబోతున్నాడు. చెడ్డ వ్యసనాలన్నిటికీ ఫుల్‌స్టాప్ పెట్టేయబోతున్నాడు.

తనలో సాఫ్ట్ కార్నర్ తనని జాగ్రత్త చేస్తూంది. లేకుంటే మారిపోవాలనే తలపు తనకెలా వస్తుంది?

జీతం రోజు.

అలా ఓ సారి ఇంటు క్లబ్బు కేసి వెళ్ళొద్దాం రారాదూ?'' అంటూ వెంకట్రమణ. ఆహా ఇలా కొలీగ్స్‌మరి!

ఇల్లు. భార్య, ముసలి అమ్మ, కిర్రుమంటూ మూలిగేదాని రోగిష్టి మంచం, చిరిగిన ఓణీలో దాచలేని యవ్వనాన్ని ఎదరింటి రాస్కెల్- ఆ శంకరంగాడి ఒళ్ళో కుమ్మరించాలని కోరికలతో కాలిపోతూ నాగరత్నం, చెవిలో జోరీగలాగ గీపెట్టే మణి గొంతు-

ఎండిపోయిన శకుంతల గుండెలో నుండి ఎగశ్వాసల గరగరలూ-

ఆ క్షణంలో గుర్తొచ్చేయి అనంతరావుకి.

'పనుంది' అన్నాడు. గొంతులో సగంలో ఏదో వణుకు! ఏదో అనిశ్చిత స్థితి.

మనసులో కలవరం. నరాలలో పీకు. గుండెలో తొలిచేస్తున్న గుబులు...

'రావయ్యా, బెట్టు చెయ్యక.'

కదిలేడు అనంతరావు ఇష్టమో, అయిష్టమో తెలీని విధంగా, మూడువందలు పోయాయి పేకాటలో.

ఆ బాధ చల్లార్చుకుందుకు వెంకటేశ్వరా వైన్స్‌లో అర్థై రూపాయల ఖర్చు. గాడిదలు, బిల్లు తన తలమీద రుద్దేరు.

ఎన్ని తంటాలు పడినా నెలలో రెండోవారం 'నేను మరింక తిరగలేను మొర్రో!' అంటూ మొరాయించింది. సిగ్గు సిగ్గు, శకుంతలకి ముఖం చూపించడానికి దమ్ములేక, అమ్మ శాపనార్థాలు భరించే తెగింపు లేక అస్తమానమూ వీధుల్లో పడి కాళ్ళు అరిగిపోయేలా తిరిగేడు.

రాత్రి పదకొండు దాటేక ఇల్లు చేరడం, అంత రాత్రివేళప్పుడు ఇంటి తలుపు కొడుతూ ఉంటే తన గుండె చప్పుడు తనకే వినిపిస్తూ ఉండేది.

తలుపు తీసిన శకుంతల ముఖంలోకి సూటిగా చూడలేని అశక్తత.

ముళ్ళ కంచెమీద పడ్డ బట్టలా ఎముకలు కనిపించే ఒళ్ళూ, జీవం ఇంకిపోయిన ఆ చూపులూ, బ్రతుకంటే విరక్తిగా సంసారమంటే రోతగా తన ఉనికినే భరించలేనట్లుగా ఉండే ఆ కళ్లలోకి తను చూడలేడు. చూసి భరించగలిగే గుండె దిటవు తనకి లేదుగాక లేదు-

అందుకే తప్పుకుగా వెళ్ళి, నడవాలో నులకమంచం వాల్చుకుని ముడుచుకుపోయి పడుకుంటాడు. శకుంతల ఏదో అడగడం ఇంకేదో అనడం, కోపంగా అరవడం బ్రతిమలాడటం వెక్కి వెక్కి ఏడవడం అన్నీ తెలుస్తూనే ఉన్నప్పుడు కళ్ళు విప్పడు. కదలడు.

తెగనరికిన దుడ్డుమానులా పడుకునుంటాడు.. ఉదయాన్నే అమ్మ తిట్లతో తెలివొస్తుంది. శకుంతల సణుగుడుతో మత్తు విగిపోతుంది. జవాబు చెప్పడు ఇన్ని మెతుకులు కొరికి ఆఫీసుకి పోతాడు.

అప్పుడప్పుడు.. తనకీ జీవితం కావాలని బలంగా అనిపించి నప్పుడు మాత్రం అయిదో పదో

పెచ్చించి రాజ్యాల్తో, రంగమ్మతో కొనుక్కుంటూ కష్టపడలేడు.

ఈ జీవితం అసహ్యం, రోత. అందుకే-

శివరాత్రికి ముందు రోజు ఖచ్చితంగా ఒక నిర్ణయానికొచ్చేడు. మర్నాటి నుంచి పాత జీవితానికి స్వస్తి చెప్పాలని ఖచ్చితంగా నిశ్చయించుకున్నాడు.

అతి ప్రయత్నం మీద అయిదొందలు అప్పు సంపాదించేడు.

రేపటినుంచి, అంటే మహాశివరాత్రి పర్వదినం నుంచి తన వైఖరి మార్చుకోబోతున్న శుభసందర్భంలో ఆ ఒక్క రోజు తృప్తిగా అన్నీ ఆఖరిసారిగా అనుభవించెయ్యాలనిపించింది. ఇరవై నాలుగ్గంటల తర్వాత వీటన్నిటికీ దూరంగా ఉండదల్చుకున్న తను ఇవాళ ఒక్క రోజూ ఎలా ఉంటే ఏం? రేపట్నుంచి తనని చూసి అమ్మ, శకుంతల పిల్లలు ఆఫీసులో వాళ్ళూ తన నెరిగిన ప్రతిప్రాణి ఆశ్చర్యపోవాలి!

ఈ ఆలోచనలో ఆనందాన్ని భరించలేక తలమునకలవుతూ ఉత్సాహంగా ఆ రోజు తృప్తిగా తాగేడు అనంతరావు. సరదాగా పేకాడేడు. ఏభయి పైచిలుకే వచ్చింది. కాంతం ఇంటో విజయనగరం నుంచి కొత్తపిల్ల వచ్చిందంటే ఆ ఆనందం కూడా చవిచూసి వచ్చేడు.

తన జీవితంలో మహత్తరమైన ఆరోజుకి ఆహ్వానం పలకడంకోసం అర్ధరాత్రి వరకూ మేలుకుని గడిపేడు. పక్కవాటాలోంచి గడియారం పన్నెండు గంటలు కొడుతూ ఉంటే గుండెమీద చెయ్యి వేసుకుని తృప్తిగా నిద్రపోయాడు ఆనందరావు.

మర్నాడు -

శివరాత్రి.

అనంతరావు ప్రవర్తనలో కనిపించిన మార్పు గమనించి ఇంట్లో వాళ్ళందరూ ఆశ్చర్యపోయేరు. ఆవేళ అనంతరావు తనే స్వయంగా మార్కెట్‌కి వెళ్ళి కూరలు తెచ్చేడు. అందరితోనూ ఉల్లాసంగా గడిపేడు. శకుంతల్ని సాయంత్రం ఫస్టుషోకి సిద్ధంగా ఉండమని చెప్పి ఆఫీసుకి బయలుదేరాడు.

అవునా?

అవునంతే. అంతవరకే నిజం. ఆ తర్వాత?

ఏం జరిగిందేం జరిగింది?!

ఆఫీసులో చిన్ననాటి మిత్రుడు కలిశాడు. సిటీ చూద్దామని కొచ్చేట్ట. ఉండటానికాట్టే వ్యవధి లేదట. సెలవు పెట్టేసి తనని సిటీ అంతా తిప్పి చూపించాలిట. ముఖ్యంగా గుర్రప్పందాలు చూడాలనుందిట. అసలవి చూద్దామనికే ఈ రోజుల్లో పనిగట్టుకొచ్చేట్ట. చూడ్డమే తప్ప పందేల జోలికి పోవడం ఇష్టం లేదుట!

ఒకే గ్రామంలో బాల్యం అంతా కలసి మెలసి తిరిగిన వాళ్ళు తామిద్దరూ. అనంతరావుకి శలవు పెట్టి అతనితో వెళ్ళక తప్పింది కాదు.

వెళ్ళాడు.

తరా్వత్రా్వత?

ముందు రోజు చేసిన అప్పులో మిగిలిన నాలుగొందల పాతికా ఏఁవయ్యాయి? అనంతరావు జేబులో ఉన్నాయా? ఉంటే కథే లేదు.

శివరాత్రి కొండ గుర్తుగా మారిపోదానుకున్న అనంతరావు దారుణంగా మళ్ళీ దారితప్పేడు నలిగిపోయేడు. చితికి పోయేడు.

అలా ఎన్నిసార్లు?

అతని పుట్టిన్రోజునాడు

మేరేజుడే నాడు

అక్టోబరు రెండు-

ఉగాది - దీపావళి -

ఎన్నెన్ని కొండ గుర్తులు అతని నిర్ణయాల ఆశలన్నీ అతని బలహీనతల పెనుగాలులకి పేకమేడలై కూలిపోయేయి!

'ఈసారి తప్పడు. రేపు ఆగస్టు పదిహేను. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజు. దేశం అంతా పండుగ చేసుకోబోతున్నది.

పాత అలవాట్లకీ, బలహీనతలకీ, జీవితానికీ గోరీ కట్టబోతున్నాడు తను. పెద్దది పెళ్ళికి ఎదిగికూచుంది. దానికి పెళ్ళి జరిగే మార్గం చూడాలి. రెండోదానికి బట్టలు కుట్టించాలి. చంటిగాడికి పొట్ట బొప్పాసుకాయలా పెరిగిపోయింది. కడుపులో బల్లలేదుకదా? అదేం జబ్బో డాక్టరుకి చూపించాలి-

అమ్మకి మందులు కొనాలి. ఆ కిర్రు మంచం చప్పుళ్ళింక తను వినలేడు. కఫం పేరుకుపోయిన ఆ దగ్గు విన్లేడు. వినలేడంతే-

గరుకు గచ్చుమీద డబ్బారేకుతో గీసినట్టు మూలిగే శకుంతల మూలుగులు విన్లేడయ్యో వినలేడు. మురికి వోడుతున్న ఆ వాయిలు చీర ఒక్కదాన్తో గడుపు కొస్తూంది. మంచి చీరలు మరో రెండు అయినా వెంటనే కొనాలి.

ఎప్పుడూ ఓ అక్షరం ముక్కయినా రాయని డైరీ తీసి, పేజీలు తిరగేసి ఓ చోట ఇలా రాసేడు.

''రేపు పర్వదినం. ఆగస్టు పదిహేను. మారాలి. మారతాను. తప్పకుండా కొన్ని నిర్ణయాలు అమలు పర్చదలుచుకున్నాను.

1. అన్ని చెడ్డ అలవాట్లూ మానెయ్యాలి.

2. శకుంతలకి నామీద నమ్మకం కుదిరేలా మంచిగా ఉండాలి.

3. పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దాలి.

4. మంచిగా మాట్లాడటం, ఆలోచించడం నేర్చుకోవాలి.

5. పొదుపుగా ఉండాలి.

ఇవి పాటించి తీరాలి. భగవాన్! నాకా శక్తి నివ్వు. డైరీ మూసి తృప్తిగా నిట్టూర్చాడు అనంతరావు.

* * *

మర్నాడుదయం-

ఆగస్టు పదిహేనవ తేదీ ఉదయం-

ప్రభాతం సముద్రం మీద వెండి నౌకలా వూగలేదు. కొత్త జీవితంలో కాంతిపుంజం వికసించలేదు. ఉదయగానం వినిపించలేదు.

'నాన్నా!' అంటూ కుదుపుతూ లేపింది నాగరత్నం. అనంతరావుకి మెలుకువ వచ్చి, లేచి మంచంమీద కూచున్నాడు. దగ్గు తెరలు తెరలుగా క్రమ్ము కొస్తూ ఉంటే వూపిరాడక బాధతో మెలికలు తిరిగిపోతూంది శకుంతల.

ఆమెని చుట్టుముట్టి ఏడుస్తూ పిల్లలు.

లేచి నించున్నాడు.

''నువ్వేరా దరిద్రుడా! నీనుంచే అదలా తయారయింది. నువ్వూ నీ తిరుగుళ్ళూ, ఇల్లు, బాధ్యతలు ఎరక్క దాని మంచీచెడ్డా పట్టించుకోవడమే మానేశావు. అదిలా రోగిష్టిదయి పోయిందంటే కారణం నువ్వే! ఇన్నాళ్ళూ నీతో సంసారం చేసి అదేం సుఖపడింది కనుక? అలా దగ్గి దగ్గి చావనీ, ఛీ నువ్వు ఒక మనిషివేనట్రా?'' రొప్పుతూ అంటూంది అమ్మ.

''నా మాట వినవే. నే నివాళ నుంచీ పూర్తిగా మారిపోయేనమ్మా' అని చెప్పాలనిపించింది అనంతరావుకి ఆ మాటలు అతని గొంతుదాటి బయటికి రాలేదు.

''లేచి, దాన్ని ఆస్పత్రికి తీసుకెళ్ళేదేవయినా ఉందా? అందుక్కూడా గతిలేక కుక్కచావు దానికి రాసిపెట్టి ఉందా?''

స్థాణువులా నిల్చుండిపోయి, అచేతనంగా చూస్తూ ఉండిపోయిన అనంతరావులో సంచలనం మొదలయింది. కర్తవ్యం స్ఫురించి అతని మెదడు వేడెక్కిపోసాగింది.

శకుంతలని ఉన్నఫళంగా హాస్పటలుకి తీసికెళ్ళాలంటే చాలా డబ్బు కావాలి. తన దగ్గరేం ఉంది కనక! ఇప్పుడెలా? అతని గుండె వేగంగా స్పందిస్తూ గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తున్నట్లయింది.

అనంతరావు వాలకం చూసి ముసిలావిడ అంది. ''ఇంకా అలా కొయ్యబొమ్మలా నిల్చుంటావేందా? రిక్షా పిలిచి వెంటనే దాన్ని ఆస్పత్రిలో చేర్చిరా, కాటికి కాళ్ళు జాపుకుని ఇవాళో, రేపో హరీమనేదాన్ని, నాకెలాగూ మందులూ మాకులూ లేవు. కనీసం దాన్ని కూడా రక్షించుకోలేని మొద్దువైపోయావే?''

అనంతరావు తల్లి ముఖంలోకి వెర్రి వాడిలా చూడసాగేడు.

"నీ దగ్గర డబ్బు లేదు కదూ? ఎలా ఉంటుందిలే డబ్బు విలువ అదిలేని నాడే తెలుస్తుంది. నీలాంటి వాళ్ళకి" అంటూ నెమ్మదిగా లేచి, తడుముకుంటూ తన పాతకాలపు రేకుపెట్టి దగ్గరికి వెళ్ళింది. పెట్టె తెరచి గుడ్డల కింద నుంచి ఒ చిన్న అట్టపెట్టి తీసింది. అందులో దాచిన డబ్బు తన చేతిలో ఉంచింది.

"ఇంద ఈ డబ్బు తీసుకుని వెళ్ళి శకుంతలకి వైద్యం చేయించు"

అనంతరావు బిత్తరపోతూ అడిగేడు. "ఇంత డబ్బు.. నీకెక్కడిదమ్మా?" అని.

ఆవిడ కస్సుమంది - "ఎప్పట్నుంచో దాచుకున్న డబ్బురా అది. మీ నాన్న బతికుండగా ఇచ్చేవాళ్ళు, అప్పుడో పావలా, అప్పుడో అర్ధానూ.. అదీ అంతకు ముందు నుంచీ కూడా దాచి పెట్టిన డబ్బురా. కోడలికి పీకల మీద కొచ్చేక కూడా బయటికి తీయకుండా ఎలాగ ఉండగలను? నువ్వింత పనికిమాలిన వాడివై పోయాక ఒకదారి చూపించకుండా నాకు తప్పుతుందా? ఇది నాకు జ్ఞానం వచ్చింది లగాయతు కూడబెట్టిన సొమ్ము ఇప్పుడిలా అవసరంలో ఉపయోగపడుతూంది".

ఏ కొండ గుర్తులూ అక్కర్లేకుండానే, జ్ఞానం వచ్చినప్పటి నుంచి, జీవితాన్ని పదిలంగా గాజుకుప్పెలా భద్రంగా కాపాడుకుంటూ, పొదుపుగా జీవితాన్ని అర్థవంతంగా మలుచుకోవడం కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఎదురు దెబ్బలు తింటున్నా ధైర్యంగా పోరాడుతూ ... అమ్మ!

తను ?

తన జీవితం ఎంత అర్ధవిహీనంగా హాస్యాస్పదంగా-

ఆశయాలేతప్ప ఆచరణలేకుండా-

ఆశలే తప్ప కృషి లేకుండా-

ఎంత నిస్సారంగా దుర్భరంగా, తయారయింది. అనుక్షణం వోడిపోతూ, వోటమిని భరించలేక పిరికితనం ముప్పిరిగొనగా వాస్తవంలో నుంచి మాయలోకి పారిపోతూ తను?!

తనో ఇడియట్-

(ఆంధ్రప్రభ వీక్లీ. 11.4.1979)